# త్వమేవాహం

నాయకుడుగారు ఎక్కిన కారు హుటా హుటిన ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో అడుగు పెట్టింది.

మెయిన్ పోర్టికోలో కారు ఆగగానే, డి.ఐ.జి., హాస్పిటల్ సూపరింటెండెంట్ ఎదురు వచ్చారు.

నాయకుడుగారు కారు దిగుతూనే ఆదుర్దాగా అడిగారు -- "అసలేం జరిగింది?" అని.

"పదండి, సార్, ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌కి వెడుతూ మాట్లాడుకుందాం"- దారి చూపాడు హాస్పిటల్ సూపరింటెండెంట్.

నడుస్తూండగా ఆయనే అన్నాడు: "మన అమ్మగారు (అంటే నాయకులు గారి భార్య), మన పిల్లలు (అంటే నాయకుడు గారి పిల్లలు) మన కారులో (అంటే నాయకుడు గారి స్వంత కారులో) వెడుతూండగా ఈ రోడ్డు ప్రమాదం అయిందిట, సార్".

నాయకుడుగారు నుదుటికి పట్టిన చెమటను తుడుచుకుంటూ అడిగారు -- "ఎలా అయింది?" అని.

డి.ఐ.జి. అన్నాడు : "అమ్మగారు, పిల్లలూ షాపింగ్ కోసమని బయలుదేరారట, సార్. మన కారు మార్కెట్ రోడ్డులో వెడుతుండగా ఈ ప్రమాదం జరిగిందట. అసలే ఆ మార్కెట్ రోడ్డు చాలా ఇరుకు!"

నాయకుడుగారి మనసులో మార్కెటు రోడ్డు విషయం మెదిలింది. కార్పొరేషన్ స్పెషలాఫీసర్ ఆ రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువ కనుక, ఆ ఇరుకు రోడ్డును వెడల్పు చేయాలని ప్రయత్నం చేశాడు. అంటే, అడ్డ వచ్చిన రెండు సినిమా హాళ్ళూ, ఒక త్రీ స్టార్ హోటలూ, రెండు బట్టల షోరూములూ, పగలకొట్టి రోడ్డును వెడల్పు చేయాలన్నమాట. స్పెషల్ ఆఫీసర్ ఈ పని ప్రారంభించబోయే ముందు, సదరు వ్యాపారవేత్తలందరూ వచ్చి నాయకుడుగారి సహాయం కోరారు. అతను ఏనాడూ ఎవరినీ కాదనలేదు కనక, మొత్తం అందరి దగ్గరా కలిపి అయిదు లక్షల రూపాయలు వసూలు చేసి, వాళ్ళకు ఏమీ ఇబ్బంది లేకుండా చేశాడు. అందుకే ఆ రోడ్డు అలా ఇరుకుగానే ఉండిపోయింది. ఆ రోడ్డు విశాలంగా ఉంటే, ఈ ప్రమాదం జరిగేది కాదేమో?

"పదండి, సార్. ఇటు", సూపరింటెండెంట్ గబగబా నడుస్తూ దారి చూపిస్తున్నాడు.

డి.ఐ.జి. అంటున్నాడు: "మన భూపతిగారి టూరిస్టు బస్సు ఎదురుగా వస్తున్నదట, సార్! మన కారును చూసి ఆ బస్సు డ్రైవర్ బ్రేక్ నొక్కాడట కానీ, బ్రేక్ సరిగ్గా పని చేయక ఆ బస్సు వచ్చి మన కారును గుద్దేసిందట!"

అవును, భూపతి! అతని బస్సులన్నీ పాడయిపోయిన డొక్కు బస్సులే! ఒక్క బస్సుకూ రోడ్డు మీద నడిచే అర్హత లేదు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇవ్వనన్నాడని తన

దగ్గరికి వచ్చి ఏడ్చాడు భూపతి. తను కాదనలేక భూపతికి ఉన్న బస్సులన్నిటికీ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇప్పించాడు. అఫ్‌కోర్సు! భూపతి కూడా తన సహాయాన్ని వూరికే తీసుకోలేదు. పది బస్సులకూ కలిపి ఒక లక్ష రూపాయలు ఇచ్చాడు. ఆ బస్సులను కండెమ్ చేసి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదేమో?

"రండి, సార్! రండి"- సూపరింటెండెంట్ ఇన్‌టెన్‌సివ్ కేర్ యూనిట్‌కు నాయకుడు గారిని తీసుకువెళ్ళాడు.

అబ్జర్వేషన్ రూమ్ ముందర అందరూ ఆగారు. ఆ రూమ్ తలుపు వేసి ఉంది.

"ఈ రూమ్‌లోనే అమ్మగారూ, బాబూ, పాపా ఉన్నారు, సార్. మన స్పెషలిస్ట్ డాక్టర్‌గారు ఆక్సిజన్ ఇచ్చి శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు" అన్నాడు - అక్కడే నించుని ఉన్న కుర్ర డాక్టర్ నాయకుడు గారికి నమస్కరించిన తరవాత.

"అందరికీ స్పృహ వచ్చిందా? కళ్ళు తెరిచి చూస్తున్నారా?" అడిగారు నాయకుడు గారు.

"..... అనుకుంటాను, సార్. మన డాక్టర్ నరసింహంగారు లోపలే ఉన్నారు. అంతా ఆయనే చూస్తున్నారు" అన్నాడు హాస్పిటల్ సూపరింటెండెంట్.

"ఎవరు? డాక్టర్ నరసింహం అంటే.... ఆ నల్లటి..."

"అవును, సార్, మన సుబ్బయ్యగారి రెండవ బావమరిది కొడుకు..."

నాయకుడుగారి ముఖంలో రంగులు మారాయి. అవును, అతను తనకు బాగానే గుర్తున్నాడు. అతనికి తను అడుగడుగునా సహాయపడ్డాడు. మెరిట్ కాండిడేట్స్‌ను కూడా వదిలేసి ఎమ్.బి.బి.ఎస్. లో అతనికి సీటు ఇప్పించాడు. సుబ్బయ్యగారు వచ్చిన తన కాళ్ళ మీద పడితే, అతనికి మార్కులు వేయించి, ఫస్ట్‌క్లాస్‌లో పాస్ చేయించాడు. తరవాత ఈ హాస్పిటల్‌లో ఉద్యోగం ఇప్పించటమే కాక, ఈ మధ్య ప్రమోషన్ కూడా ఇప్పించాడు. ఎదుటివాడి కష్టాలన్నీ తన కష్టాలుగా భావించే తను, ఎవరు ఏ సహాయం అడిగినా కాదనలేడు మరి! అందుకే సుబ్బయ్యగారి కాండిడేట్‌ను ప్రత్యేకమైన శ్రద్ధతో పైకి తీసుకు వచ్చాడు. సుబ్బయ్యగారు కూడా తన సహాయాన్ని మరిచిపోలేదు. చాలా బాగా ముట్టచెప్పి, ఈ జన్మలోనే ఋణ విముక్తి చేసుకున్నాడు. అయితే -- ఇప్పుడు ఆ నరసింహమే తన పెళ్ళాం, పిల్లల్ని ట్రీట్ చేస్తున్నాడన్నమాట... అయ్యో! అదెలాగ? అతనికి వైద్యం గురించి ఏం తెలుసు? వెంటనే అతణ్ణి బయటికి పిలిచి, ఇంకో మంచి డాక్టర్ని లోపలికి పంపించాలి. అలా అయితేనే తన భార్య, ముద్దుల పిల్లలూ బ్రతికేది.

నాయకుడుగారు ఎండిపోయిన గొంతు తడి చేసుకున్నాడు.

ఇంతలో ఆ అబ్జర్వేషన్ రూమ్ తలుపు తెరుచుకుంది.

డాక్టర్ నరసింహం చెమట తుడుచుకుంటూ బయటకి వచ్చాడు.

"ఏమయింది?" అడిగారు నాయకుడుగారు ఆదుర్దాగా.

డాక్టర్ నరసింహం ఆటెన్షన్‌లోకి వచ్చి, నిటారుగా నిలబడి తల వంచుకున్నాడు.